

పీడీయాక్టు నమోదు చేయాలి

అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేశ్, రాజేశ్‌పై పీడీ యాక్టు నమోదు చేయాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు.

- 10లో ▸



ఆగం చేసిన కల్తీ కల్లు!

నిత్యం కల్తీ కల్లు సేవించే అలవాటు శబరి మల్లై వెళ్లిన వారిని ఆగం చేసింది. శెట్పల్లి సంగారెడ్డికి చెందిన ఓ వ్యక్తి తప్పిపోయాడు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.9 /18.4

వాతావరణం

పొగమంచు కురుస్తుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

డీజీపీని కలిసిన సీపీ



ఖలీల్‌వాడి: రాష్ట్ర డీజీపీగా అంజనీ కుమార్ శనివారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అంజనీకుమార్‌ను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు

- జిల్లా జడ్జి సునీత కుంచాల



ఖలీల్‌వాడి: మైనర్లు వాహనాలు నడపవద్దని.. మేజర్లు మాత్రమే నడపాలని, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో మానవహక్కుల అవగాహన సదస్సులో మాట్లాడారు. వరకట్న నిషేధ చట్టం, పోక్సో చట్టం, సమానత్వం మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. సీనియర్ జడ్జి పద్మావతి మాట్లాడుతూ.. మానవ హక్కులను కోర్టుల ద్వారా సాధించుకోవచ్చన్నారు. సీనియర్ న్యాయవాది గొర్రెపాటి మాధవరావు మాట్లాడుతూ.. రాజకీయ, సాంఘిక, ఆర్థిక అంశాల్లో సమన్యాయంపై వివరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రాజ్‌కుమార్ సుబేదార్, మాణిక్‌రాజ్, ప్రిన్సిపాల్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్కులు, దుప్పట్లు తీసుకురావాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

సుభాష్‌నగర్: ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చేవారు పూల బొకేలకు బదులు నోట్ బుక్కులు, దుప్పట్లు వంటి వాటిని తీసుకురావాలని కలెక్టర్ నారాయణరెడ్డి శనివారం ఓ ప్రకటనలో కోరారు. శుభాకాంక్షల రూపంలో సమకూరిన నోట్‌బుక్కులు, దుప్పట్లను పేద విద్యార్థులకు అందజేస్తామన్నారు. ఇవి విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. కాగా నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లో ఆదివారం ఉదయం పది గంటల నుంచి అందుబాటులో ఉంటారని కలెక్టర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

కొనసాగుతున్న నీటి విడుదల

నిజాంసాగర్: యాసంగి పంటల సాగు అవసరాల కోసం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఆయకట్టు కింద ప్రస్తుతం వరినాట్లు వేస్తుండడంతో ప్రధాన కాలువకు నీటిని విడుదల చేస్తున్నారు. మొదటి దఫా నీటి విడుదల డిసెంబర్ 14 న ప్రారంభమైన విషయం తెలిసిందే. వాస్తవానికి మొదటి విడతలో పదిహేను రోజుల పాటే ఆయకట్టుకు నీటిని విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ ఆయకట్టు ప్రాంత అవసరాల మేరకు నీటి విడుదల కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు రోజుకు 1,500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా శనివారం సాయంత్రానికి 1,403.22 అడుగుల(15.281 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.



నగరంలోని ఓ కళాశాలలో సందడి చేస్తున్న విద్యార్థినులు

నవ సంకల్పం

కాలగర్భంలో మరో ఏడాది కలిసిపోయింది. ఎన్నో మధురానుభూతులు, మరెన్నో విషాద ఘటనలకు సాక్షిగా నిలిచిన 2022 సంవత్సరం జ్ఞాపకంగా మిగిలిపోయింది. అదే సమయంలో కోటి ఆశలను మోసుకుంటూ 2023 రానే వచ్చింది. 2022కు వీడ్కోలు చెప్పిన జిల్లా వాసులు.. ఆంగ్ల నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. శనివారం అర్ధరాత్రి జిల్లావ్యాప్తంగా కొత్త సంవత్సర సంబురాలు అంబరాన్నంటాయి. పిల్లలనుంచి పెద్దల వరకు చాలామంది అర్ధరాత్రి 12 గంటలకు మేల్కొని ఉండి, శుభాకాంక్షలు చెప్పుకుంటూ సందడి చేశారు.

పరమాత్ముని శరణే అన్నింటికీ పరిష్కారం

- శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ప్రకృతిని, పంచభూతాలను నడిపించే పరమాత్మను శరణు వేడుకోవడమే అన్నింటికీ పరిష్కారమని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో పాల్గొనేందుకు స్వామీజీ శనివారం నిజామాబాద్‌లోని ఉత్తర తిరుపతి క్షేత్రానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. విపత్తులను, అతివృష్టి, అనావృష్టి తట్టుకునే శక్తి పొందాలంటే భగవంతుడిని వేడుకోవాలన్నారు. వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటే భగవంతుని అనుగ్రహం లభిస్తుందన్నారు. నిజామాబాద్‌లోని ఉత్తర తిరుపతి క్షేత్రంలో ఉత్తర ద్వార దర్శనం చేసుకోవాలన్నారు. ఇక్కడ వేంకటేశ్వర స్వామితో పాటు మహాలక్ష్మి అమ్మవారు, బ్రహ్మ, విష్ణు, మహేశ్వర స్వరూపమైన దత్తాత్రేయుడు, వినాయకుడు, హనుమంతుడుతో పాటు తిరుమలలో ఉన్నవిధంగా శ్రీచక్రం ప్రతిష్ఠాపన చేసి ఉన్నాయన్నారు. ద్వాపర యుగం తరువాత మహావిష్ణువు కలియుగ దైవం వేంకటేశ్వరస్వామిగా అవతరించారన్నారు. దైవానుగ్రహంతో అందరికీ సద్బుద్ధి కలగాలని స్వామీజీ ఆకాంక్షించారు.



ఉత్తర తిరుపతి క్షేత్రంలో సచ్చిదానంద స్వామి



అభివృద్ధికి ప్రాధాన్యం..

- సంక్రాంతి తర్వాత 'డబుల్' ఇళ్ల పంపిణీ
- జనవరి 18 నుంచి కంటివెలుగు
- జిల్లాలో పామాయిల్ సాగుకు ప్రోత్సాహం
- జనవరిలో సీఎం పర్యటన
- 'సాక్షి' ముఖాముఖిలో కలెక్టర్ నారాయణరెడ్డి



నూతన ఏడాదిలో మరిన్ని అభివృద్ధి పనులతో పాటు పకడ్బందీగా సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తామని కలెక్టర్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. సంక్రాంతి తర్వాత నుంచి డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ ప్రారంభిస్తామన్నారు. అలాగే జిల్లాలో పామాయిల్ సాగుపై రైతులు ఆసక్తి కనబర్చేలా అవగాహన కల్పించి ప్రోత్సహిస్తున్నామన్నారు. నిజామాబాద్ నగరంలో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ప్రారంభిస్తామని తెలిపారు. కొత్త ఏడాది సందర్భంగా 'సాక్షి' ఇంటర్వ్యూలో కలెక్టర్ పలు అంశాలపై మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

–సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

■ జిల్లాలోని నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ అర్బన్, బాల్కొండ, ఆర్మూర్, బోధన్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో 6,800 డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. సంక్రాంతి తర్వాత విడతల వారీగా ఈ ప్రక్రియ ఉంటుంది. ఇక జనవరి 18వ తేదీ నుంచి జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం చేపట్టనున్నాం. వంద రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. 18 ఏళ్లు పైబడిన వారందరికీ కంటి పరీక్షలు చేయిస్తాం. కళ్లజోళ్లు అందిస్తాం. కాగా జనవరిలో జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటించనున్నారు.

■ జనవరి 5న ఓటర్ల తుది జాబితా విడుదల చేయనున్నాం. తరువాత కూడా ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతుంది. మరోవైపు జిల్లాలో పామాయిల్ సాగు చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం. 6వేల ఎకరాల లక్ష్యానికి గాను ఇప్పటివరకు 2,100 ఎకరాల్లో మొక్కలు నాటించాం. మార్చిలోగా అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ముందుకు వెళ్తున్నాం.

■ నిజామాబాద్ నగరంలో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లు త్వరగా నిర్మాణం పూర్తయ్యేలా తగిన విధంగా ముందుకు వెళ్తున్నాం. అదేవిధంగా కళాభారతి, స్టేడియం, బస్‌స్టేషన్ నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కోసం మరో రూ. 30కోట్లు మంజూరయ్యాయి. జూన్‌లో అందుబాటులోకి వస్తుంది. బొడ్డెమ్మ చెరువు సుందరీకరణ పనులు త్వరలో పూర్తి కానున్నాయి.

■ జిల్లాలో 7వేల ఎకరాలకు సంబంధించి అటవీ, రెవెన్యూ శాఖల జాయింట్ సర్వే జరిగింది. 1,400 ఎకరాలు రెవెన్యూగా తేల్చడం జరిగింది. మిగిలిన భూమి అటవీ పరిధిలో ఉంది. 2005కు ముందు నుంచి సాగు చేసే భూములు ఉంటే దరఖాస్తు చేసుకోవాలి. పరిశీలించి ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు కేటాయిస్తాం.

■ జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు ముందుకొచ్చేవారికి చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇందుకోసం అంకాపూర్‌లో 150 ఎకరాలు, మల్కాపూర్‌లో 300 ఎకరాలు కేటాయించాం. వీటిల్లో యూనిట్లు పెట్టేందుకు 70 వరకు దరఖాస్తులు వచ్చాయి. టీఎస్‌ఐపాస్ కింద రూ. 50లక్షల వరకు సబ్సిడీ వస్తుంది. మరోవైపు జిల్లాలో రెండు ఫార్మర్ ప్రొడక్షన్ ఆర్గనైజేషన్లు మంజూరయ్యాయి. వీటికి నాబార్డు నుంచి రుణాలు వస్తాయి.

■ ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున దళితబంధు యూనిట్లు మంజూరయ్యాయి. జనవరి నుంచి మార్చి మధ్యలో లబ్ధిదారులను ఎంపిక చేసి అందిస్తాం. అదేవిధంగా 'మన ఊరు–మన బడి' కింద ప్రతి మండలంలో రెండు చొప్పున పాఠశాలలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

నేరస్తులపై ఉక్కుపాదం

- జిల్లాలో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం
- డ్రగ్స్, మట్కా రాయుళ్ల ఆటకట్టిస్తాం
- చిన్నారులపై అఘాయిత్యాలను అరికట్టడంపై ప్రత్యేక దృష్టి
- సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి
- పోలీస్ కమిషనర్ నాగరాజు



జిల్లాలో డ్రగ్స్, గంజాయి, మట్కా, పేకాటపై ఉక్కుపాదం మోపుతామని పోలీస్ కమిషనర్ కేఆర్ నాగరాజు అన్నారు. చిన్నారులపై అఘాయిత్యాలను అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం అమలు చేస్తున్నామన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా 'సాక్షి' నిర్వహించిన ఇంటర్వ్యూలో పోలీస్ కమిషనర్ పలు అంశాలపై మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

–ఖలీల్‌వాడి

■ డ్రగ్స్, మట్కా, గంజాయి, పేకాటలను ఉపేక్షించబోం. విద్యార్థులు డ్రగ్స్, గంజాయి, మద్యానికి అలవాటు పడుతున్నారు. ఇంటి వద్ద పిల్లల పరిస్థితులను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాలి. మీ పరిసర ప్రాంతాల్లో మత్తు పదార్థాలు అమ్మితే పోలీసులకు సమాచారం అందించాలి. యువకులు, విద్యార్థులు మత్తుకు బానిసకావద్దు. దీంతో అనేక అనర్థాలు జరుగుతాయి. మత్తు పదార్థాల రవాణాపై నిఘా పెట్టాం. దీనిపై జిల్లా పోలీసు యంత్రాగం ప్రత్యేక దృష్టి సారించింది.

■ మహిళలు, యువతులు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు షీ టీమ్స్, పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడిన వారిపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశాం. ఈ ఏడాది 71 కేసులు నమోదయ్యాయి. వీటిపై చార్జిషీట్ కోర్టులో దాఖలు చేసి శిక్షలు పడేలా చేశాం. షీటీమ్స్ ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. పోకిరిలు వేధింపులకు పాల్పడితే షీటీమ్స్ గాని సంబంధిత పోలీస్‌స్టేషన్‌ల్లో, డయల్ 100కు ఫోన్ కాల్ చేస్తే పోలీసులు చర్యలు తీసుకుంటారు.

■ జిల్లాలో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం అమలు చేస్తున్నాం. పోలీస్‌స్టేషన్ వచ్చే ఫిర్యాదుదారులతో పోలీసులు ఫ్రెండ్లీగా వ్యవహరించాలి. ఫిర్యాదుదారుల నుంచి సమాచారం తీసుకొని వారికి కావాల్సిన న్యాయం అందిస్తాం. ఫిర్యాదుదారులపై అశ్రద్ధ వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం. తెలంగాణ రాష్ట్రంలో ఒకే సర్వీస్, ఒకే పోలీసింగ్ విధానం ఉంది. ఎట్టి పరిస్థితిల్లో వివాదరహితంగా సేవలు అందిస్తాం.

■ అతివేగంగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. యువకులు రాష్ డ్రైవింగ్ చేయవద్దు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. కుటుంబసభ్యులను దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని సూచించారు.

■ జిల్లాలో సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. టెక్నాలజీతో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారు. సైబర్ నేరాలపై ప్రతి బుధవారం ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో అవగాహన కల్పిస్తున్నాం. సైబర్ నేరం జరిగితే 1930 లేదా డయల్ 100కు ఫోన్ చేయాలి. 24 గంటల్లో బాధితులు ఫోన్ చేస్తే సమస్యకు త్వరగా పరిష్కారం లభిస్తుంది. స్మార్ట్‌ఫోన్‌కు వచ్చిన అనవసరమైన లింకులను ఓపెన్ చేయవద్దు. దీంతో సైబర్ నేరగాళ్లు మోసం చేస్తారు.

నిరుద్యోగుల్లో 'నయా' జోష్

- వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లు
- కొత్త ఏడాదిలో కొలువు కోసం వేట
- సన్నద్ధమవుతున్న ఉద్యోగార్థులు

జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు

కేటగిరి	నిజామాబాద్	కామారెడ్డి
ఎస్సీ	3445	6372
ఎస్టీ	1265	2562
బీసీ-ఏ	1365	3745
బీసీ-బీ	3782	7864
బీసీ-సీ	278	345
బీసీ-డీ	4163	6891
బీసీ-ఈ	845	2512
ఓసీ	1863	4582

నిజామాబాద్‌అర్బన్: నిరుద్యోగుల్లో 'నయా' జోష్ నెలకొంది. కొత్త ఏడాది ముంగిట కొలువుల జోష్ వచ్చింది. టీఎస్‌పీఎస్సీ వరుసగా నోటిఫికేషన్లు ఇవ్వడంతో ఉద్యోగార్థుల్లో ఆశలు రేకెత్తాయి. గత రెండు మూడు రోజుల్లో గ్రూప్–2, గ్రూప్–3, గ్రూప్–4, స్టాఫ్‌నర్సు తదితర ఉద్యోగాలకు నోటిఫికేషన్ వచ్చింది. దీంతో ఉద్యోగాల కోసం పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు సన్నద్ధమవుతున్నారు.

మొదలైన గ్రూప్–4 దరఖాస్తు ప్రక్రియ

ప్రభుత్వం ఈ ఏడాది జూన్‌లో గ్రూప్–1 నోటిఫికేషన్ జారీ చేసి ప్రిలిమినరీ పరీక్షలు కూడా నిర్వహించింది. ప్రస్తుతం మెయిన్స్ కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. అలాగే ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులకు ప్రిలిమ్స్, ఈవెంట్స్ కూడా పూర్తయ్యాయి. మెయిన్స్ నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుతం తాజాగా గ్రూప్–2, గ్రూప్–3, గ్రూప్–4, స్టాఫ్‌నర్సు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాల్లో గ్రేడ్–1, గ్రేడ్–2 వార్డెన్లు, జూనియర్ లెక్చరర్లు, వ్యవసాయ శాఖ, భూగర్భ గనుల శాఖలో పోస్టులకు భర్తీకి సంబంధించి టీఎస్పీఎస్సీ నోటిఫికేషన్లు జారీ చేసింది. శనివారం నుంచి గ్రూప్–4కు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ కూడా మొదలైంది.

శిక్షణ తీసుకునేందుకు ఏర్పాట్లు

పెద్ద ఎత్తున కొలువుల నోటిఫికేషన్లు రావడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. దీంతో ఎలాగైనా కొలువు సాధించాలని ప్రిపరేషన్ కోసం సిద్ధమవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నమోదు చేసుకున్న నిరుద్యోగుల సంఖ్య సుమారు 51,879గా ఉంది. క్షేత్రస్థాయిలో మాత్రం అంతకంటే ఇంకా ఎక్కువ సంఖ్యలో ఉంటారు. ప్రస్తుతం వరుస నోటిఫికేషన్లు రావడంతో పరీక్షల కోసం ప్రిపేర్ అవుతున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు ప్రాంతీయ గ్రంథాలయాల్లో చదువుకునే వారితో పాటు, శిక్షణ కేంద్రాలు, ఆన్‌లైన్‌లో శిక్షణ తీసుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయానికి ప్రతిరోజూ 500 నుంచి 1000 మంది వస్తున్నారు. ప్రాంతీయ గ్రంథాలయాలకు 200 నుంచి 300 మంది వరకు ప్రిపరేషన్ కోసం వస్తున్నారు. అనేక మంది ఆన్‌లైన్‌లో శిక్షణ పొందుతున్నారు. ఈసారి ఎలాగైనా ఉద్యోగం సంపాదించాలనే పట్టుదలతో ఉన్నారు. రాత్రింబవళ్లు కష్టపడి చదువుతున్నారు.



షెడ్యూల్ ప్రకారం భర్తీ చేయాలి



ప్రభుత్వం ఎన్నికల వేళ నిరుద్యోగుల్ని బుట్టలో వేసుకునేందుకు నోటిఫికేషన్లు ఇచ్చినట్లుంది. ఈసారి కూడా నిరుద్యోగులను మోసం చేస్తే ఊరుకోనేది లేదు. నోటిఫికేషన్లకు సంబంధించి షెడ్యూల్ ప్రకారం పోస్టులు భర్తీ చేయాలి.

– రమావత్‌లాల్‌సింగ్, తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర కో–ఆర్డినేటర్

ఆరు నెలలుగా ప్రిపేరవుతున్నా..



గత ఆరు నెలల నుంచే పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాను. ఈసారి ఎలాగైనా ఉద్యోగం సంపాదించాలనే పట్టుదలతో చదువుతున్నాను. కష్టపడి తప్పనిసరిగా ఉద్యోగం సాధిస్తాను.

– పీర్యా, నిరుద్యోగి

రైల్వే పనులు మరింత ముందుకు..

- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు వంద శాతం కేంద్ర నిధులతో నిర్మిస్తున్న వివిధ ప్రాంతాల్లో ఆర్‌ఓబీల పనులు వేగంగా సాగుతున్నాయని ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిరంతరం సమీక్ష చేస్తూ కాంట్రాక్టర్ల మీద, రాష్ట్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడంతో పనుల వేగం పెరిగిందన్నారు. మామిడిపల్లి, అడవి మామిడిపల్లిలో వంద శాతం కేంద్ర నిధులతో నిర్మిస్తున్న ఆర్‌ఓబీల పనుల్లో వేగం పెరిగిందన్నారు. గోవింద్‌పేట ఆర్‌ఓబీ నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. నిజామాబాద్ వాసుల దశాబ్దాల కలగా ఉన్న మాధవనగర్ ఆర్‌ఓబీ పనులు వేగం పుంజుకున్నాయన్నారు. బోధన్, అర్సపల్లి ఆర్‌ఓబీల నిర్మాణ పనుల అనుమతులలో కూడా పురోగతి ఉందన్నారు. ఇక నిజామాబాద్ నుంచి గూడ్స్ షెడ్‌ను జానకంపేటకు తరలించేందుకు రూ.12 కోట్లు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. దీంతో నిజామాబాద్ రైల్వే స్టేషన్ మీద ఒత్తిడి తగ్గి మరిన్ని రైళ్లు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు నిర్వహణకోసం బోధన్ వరకు వెళ్తున్న రాయలసీమ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఇక నుంచి నిజామాబాద్‌లోనే ఆగుతుందన్నారు. దీనిని బోధన్ వరకు పొడిగించాలన్న తన ప్రతిపాదన త్వరలోనే కార్యరూపం దాల్చనుందన్నారు. రానున్న రోజుల్లో నిజామాబాద్‌కు మరిన్ని కొత్త రైళ్లు వేయడానికి కూడా వీలుపడుతుందన్నారు. ఇటీవల పార్లమెంట్ సమావేశాల సమయంలో కేంద్ర రసాయన, ఎరువుల శాఖ మంత్రి భగవంత్ ఖూబాతో కలిసి బోధన్–బీదర్ కొత్త రైల్వే లైన్ మంజూరు చేసి వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరినట్లు తెలిపారు. కరీంనగర్– ముంబయి మధ్య నడిచే ప్రత్యేక రైలును వారానికి ఒకసారి నుంచి 3 సార్లకు పెంచాల్సిందిగా కోరామన్నారు. ఇప్పటివరకు తెలంగాణ సరిహద్దులోని ధర్మాబాద్ వరకే పరిమితమైన మరాఠ్వాడా ఎక్స్‌ప్రెస్‌ను నిజామాబాద్ వరకు పొడిగించాలని రైల్వే శాఖకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఇక ముత్కేడ్– సికింద్రాబాద్ డబ్లింగ్ లైన్ పనులు ఇప్పటికే మంజూరై పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ లైన్ కు మరిన్ని నిధులు కేటాయించాల్సిందిగా రైల్వే శాఖకు ప్రతిపాదనలు పంపినట్లు అర్వింద్ పేర్కొన్నారు.

4న ఉద్యోగ మేళా

నిజామాబాద్ నాగారం : జిల్లాలో ఉన్న నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం 4న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో క్రెడిట్‌కార్డు, రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, డాటాఎంట్రీ ఆపరేటర్, టెలీకాలర్స్ కోసం నియామకాలు చేపడుతున్నట్లు వివరించారు. 18 నుంచి 30 ఏళ్లలోపు ఉన్న నిరుద్యోగులు జిల్లా కేంద్రంలోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి 2 గంటల వరకు బయోడేటా, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 99594 56793 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



నేడు ఇంద్రవెల్లిలో కలుద్దాం

- సోషల్ మీడియాలో వీడియో విడుదల చేసిన రెంజర్ల రాజేష్



ఖలీల్‌వాడి: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో మహర్ వీరుల విజయోత్సవ దినోత్సవంలో ఆదివారం కలుద్దామని రెంజర్ల రాజేష్ సోషల్‌మీడియాలో శనివారం వీడియో విడుదల చేశారు. అంబేడ్కర్ స్థాపించిన విజయోత్సవ దినోత్సవాన్ని జరుపుకుందాం అని పోస్ట్ చేశారు. ఈ వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. అయ్యప్ప స్వామిపై రెంజర్ల రాజేష్ చేసిన పాటల వీడియోలు సోషల్‌మీడియాలో రావడంతోపాటు కొడంగల్‌లో జరిగిన సభలో బైరి నరేష్‌తో రాజేష్ పాల్గొన్న వీడియోతో శుక్రవారం అయ్యప్పస్వాములు ముప్కాల్ మండలం రెంజర్లలో ఆయన ఇంటిని ముట్టడించిన విషయం తెలిసిందే. బైరి నరేష్, రెంజర్ల రాజేష్‌పై జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లో సుమారు 10 నుంచి 15 ఫిర్యాదులు చేశారు. శనివారం నగరంలోని మూడు పోలీస్‌స్టేషన్‌లో రాజేష్‌పై ఫిర్యాదు చేశారు. కాగా రాజేష్ ముందస్తు బెయిల్ తీసుకోవడానికి హైకోర్టు న్యాయవాదిని ఆశ్రయించినట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు రాజేష్ ఆర్మూర్, నిజామాబాద్‌లో అరెస్ట్ అయినట్లు వదంతులు వచ్చాయి. శనివారం రాత్రి రాజేష్‌ను హైదరాబాద్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్న ట్లు తెలుస్తోంది. ఈ విషయమై సీపీ నాగరాజును వివరణ కోరగా రాజేష్‌ను అరెస్ట్ చేయలేదని, వికారాబాద్ పోలీసులు కోరితే జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి అక్కడి వారికి అప్పగిస్తామని తెలిపారు.

ప్రథమ చికిత్సపై అవగాహన



డిచ్‌పల్లి : అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదానికి గురైన వారికి ప్రథమ చికిత్సను అందించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ తుకారాం రాథోడ్ సూచించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో శనివారం ఆశవర్కర్లకు ఓరల్, ఐ, ఇయర్, ఎమర్జెన్సీ (ఓఈఈఈ) కేస్ లను ఎలా తీసుకోవాలనే అంశాలపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీవోడీటీటీ ఆఫీసర్ డాక్టర్ నాగరాజు, టీవోటీ లు స్వామి సులోచన, రవి, పద్మలత, సుకన్య, భూలక్ష్మి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మోపాల్: మండలంలోని సిర్‌పూర్ గ్రామానికి చెందిన చిటికల చిన్నారెడ్డి (53) అనే రైతు అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మహేష్ శనివారం తెలిపారు. వివరాలు.. చిన్నారెడ్డి తనకున్న భూమిలో వ్యవసాయంతోపాటు పాలు విక్రయించి జీవనం సాగిస్తున్నాడు. అప్పులు చేసి గేదెల షెడ్డు ఏర్పాటు చేసుకోవడం, అందులో నష్టాలు రావడంతో అప్పులు పెరిగిపోయాయి. ఆ బాధ భరించలేక గేదెల షెడ్డులో శుక్రవారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. చిన్న కొడుకు నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పు తీర్చలేక ఒకరు..

భిక్కనూరు: ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు తీరకపోవడంతో తాగుడుకు బానిసైన ఒక్కరూ ఆత్మహత్య చేసుకున్న ఘటన భిక్కనూరు మండలం భాగిర్తిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై ఆనంద్‌గౌడ్ తెలిపిన విరవాలు.. గ్రామానికి చెందిన వెంకన్నగారి పోచ్యయ్య(62) కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఆయనకు భార్య సత్తవ్వ ఒక్క కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పిల్లల పెళ్లీలు చేశారు. అనంతరం పాత ఇంటి స్థానంలో అప్పులు చేసి ఇల్లు కట్టుకున్నాడు. రోజు కష్టపడ్డప్పటికీ అప్పులు తీరక పోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురై మద్యానికి బానిసయ్యాడు. భార్య సత్తవ్వ తాగోద్దని చెప్పుండడంతో ఆమెతో తరచు గొడవ పడేవాడు. పోచయ్య శుక్రవారం రాత్రి కూడా తాగి రాగా భార్య అభ్యంతరం చెప్పింది. దీంతో ఆయన గొడపపడి బయటకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే రామాయంపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు సిద్దిపేట ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శనివారం వేకువజామున అక్కడ మృతి చెందాడు.

ట్రాన్స్‌ఫార్మర్ రాగి తీగ చోరీ



మాక్లూర్: మండలంలోని అమ్రాద్‌కు చెందిన మమ్మాయి రాజన్న, రాజేందర్ అనే రైతులకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు ధ్వంసం చేసి రాగి వైర్‌తో పాటు ఆయిల్‌ను చోరీ చేశారు. మాణిక్‌భండార్ శివారులో మమ్మాయి రాజన్న, రాజేందర్ సొంతంగా 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను పెట్టుకొని వ్యవసాయం చేసుకుంటున్నారు. గురువారం రాత్రి దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైర్, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. రైతులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

104 వాహనాల వేలానికి టెండర్లు

నిజామాబాద్ నాగారం: జిల్లాలో 104 వాహనాలకు సంబంధించి టెండర్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు వైద్యశాఖ అధికారి సుదర్శన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎనిమిది వాహనాలు ఉన్నాయని ఈనెల 5లోపు ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్లతో సహా ఈఎండీ కట్టి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈనెల 7న వేలం నిర్వహిస్తామని, ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలన్నారు. http://auction.telangana.gov.inలో నిబంధనలు తెలుసుకోవాలన్నారు. వివరాలకు 96526 98924, 94417 06466, 73374 45545 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.







న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి, కలెక్టర్

సుభాష్‌నగర్: జిల్లా ప్రజలకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి వేర్వేరు ప్రకటనల్లో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2023 సంవత్సరం ప్రతి ఒక్కరికి శుభాలను చేకూర్చాలని, ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్ ఇంట్లో చోరీ

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధి మారుతినగర్‌లో నివాసం ఉండే ట్రాఫిక్ కానిస్టేబుల్ ఇంట్లో చోరీ జరిగింది. రూరల్ నార్త్ సీఐ జగడం నరేష్ తెలిపిన వివరాలు.. మారుతినగర్‌లో నివాసం ఉండే గంగాధర్ ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన రాష్ట్రపతి బందోబస్తు డ్యూటీ వేశారు. గంగాధర్ భార్య శ్రీరామ్ ప్రియాంక డిసెంబర్ 25న ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో గల బంధువుల ఇంటికి వెళ్లింది. శుక్రవారం రాత్రి దొంగలు ఇంటితాళాన్ని పగలగొట్టి బీరువాను తెరిచి 15 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి పట్టగొలుసులు, రూ. 30వేల నగదును చోరీ చేశారు. శనివారం ఉదయం గంగాధర్ తన భార్యతో కలిసి ఇంటికి చేరుకున్నారు. ఇంటితాళం పగలగొట్టి ఉండటంతో రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. నిజామాబాద్ ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ నరేష్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కాలనీలో సీసీ పుటేజీలను పరిశీలించారు.







వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణ సాధించాలని, ఇందుకు అధ్యాపకులు కృషిచేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రఘురాజ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల, ప్రభుత్వ కో–ఎడ్యుకేషన్ కళాశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. కళాశాలలోని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు.











ప్లాంటేషన్ పనుల పరిశీలన



ఎడపల్లి(బోధన్): మండలంలోని అశోక్‌సాగర్ వద్ద అటవీశాఖ చేపట్టిన ప్లాంటేషన్ పనులను జిల్లా ఫారెస్ట్ అధికారి రామకృష్ణ శనివారం పరిశీలించారు. అశోక్‌సాగర్ వద్ద ఎన్ని మొక్కలు నాటారు. వాటి సంరక్షణ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొక్కలను సంరక్షించాలని సూచించారు. ఎఫ్ఆర్‌వో పద్మారావు, ఎఫ్ఎస్‌వో ప్రతాప్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ప్రవీణ్, మంజులత, రాజేందర్ ఉన్నారు.





